

దునియా విజయ్‌కు కోర్టులో చుక్కెదురు

బెంగళూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కన్నడ నటుడు దునియా విజయ్ విడాకుల కోసం దాఖలు చేసుకున్న పిటిషన్‌ను ఫ్యామిలీ కోర్టు కొట్టివేసింది. 2018లో దునియా విజయ్ భార్య నుంచి విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించారు. భార్య నాగరత్న క్రూరంగా వ్యవహరిస్తున్నారని ఆమెతో కలిసి ఉండలేనని విడాకులు ఇప్పించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ వేళ భార్య నాగరత్నపై చేసిన ఆరోపణలకు సాక్ష్యాలను పొందుపరచకపోవడంతో విడాకుల పిటిషన్ కొట్టివేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. దీంతో దునియా విజయ్ కుటుంబ వివాదం మళ్లీ మొదటికి వచ్చినట్లు అయ్యింది.



విభజన..!

- బీబీఎంపీ ఎన్నికలపై సర్కార్ పాతపాట
- మళ్లీ తెరపైకి వార్డుల విభజన అంశం
- నాలుగేళ్లుగా కరువైన పాలకవర్గం
- ఆశావహులకు తప్పని ఎదురుచూపు

బెంగళూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని నగరం అత్యంత ఎక్కువ జనాభా, విస్తీర్ణం కల్గిన బెంగళూరు నగరానికి నాలుగేళ్లుగా పాలకవర్గం లేకుండా పోయింది. ఎన్నికలకు సిద్ధమంటూ ప్రభుత్వాలు ప్రకటించడమేగానీ ఆ వెంటనే ఏదో ఒక అంశాన్ని తెరపైకి తెచ్చి వాయిదాలు వేసే విధానం కూడా సాగుతున్నట్లు విమర్శలూ ఉన్నాయి. బీబీఎంపీ ఎన్నికలు త్వరలోనే జరుపుతామని బెంగళూరు నగర అభివృద్ధిశాఖ మంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. మంగళవారం బీబీఎంపీలో భిన్నమైన అంశాలపై సమీక్ష జరిపిన సందర్భంలో ఎన్నికలు జరపాలన్నారు. బుధవారం తెల్లారేసరికే విభజన అంశం తెరపైకి వచ్చింది. బెంగళూరు పాలికెను ఐదుగా విభజించాలనే డిమాండ్ వచ్చాయి. బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలు వారి కార్యకర్తలకు శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు ముగియగానే బీబీఎంపీ ఎన్నికలు ఉంటాయనే ఆశలు కల్పించారు. శాసనసభ ఎన్నికలు ముగిసి ఏడాది దాటింది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల తతంగం కూడా ముగిసింది. ఇక బీబీఎంపీ ఎన్నికలు వస్తాయని పోటీ చేయదలచుకున్న ఆశావహులు తమ వార్డుల పరిధిలో క్రియాశీలకం అవుదామని భావిస్తుండగా విభజన అంశం పెల్లుబికడంతో నిరాశ నెలకొంది.

● 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనూహ్యమైన మెజారిటీ సాధించింది. ఆ వెంటనే బీబీఎంపీ ఎన్నికలు జరపాలని భావించారు. నగర పరిధిలో ఎక్కువమంది ఎమ్మెల్యేలు ఉండడంతో కలసి వస్తుందని ఆశించారు. అయితే కొత్త ప్రభుత్వంలో గ్యారెంటీలతో లోక్‌సభలో అత్యధిక సీట్లు పొంది బీబీఎంపీని దక్కించుకుందామని కొంత వెనుకడుగు వేశారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నగర పరిధిలోని మూడింటితోపాటు బెంగళూరు గ్రామీణ లోక్‌సభ స్థానానికి పలు వార్డులు అనుబంధంగా ఉన్నాయి. నాలుగుచోట్ల ఓడిపోవడంతో కాంగ్రెస్ అగ్రనేతలు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ఎన్నికల్లోకి వెళ్తే ఎటువంటి పరిణామాలు వస్తాయోననే బెంగ పట్టుకుంది.

● ఎన్నికలు జాప్యం చేసేందుకు బీబీఎంపీని మూడు భాగాలు చేస్తామని ప్రకటించారు. శాసనసభలో బిల్లులు పెట్టారు. మూడు రోజులపాటు చర్చలు జరిపారు. సదరు బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. కానీ సదరు బిల్లు వాపసు రాలేదు. విభజనలకు స్థానికంగా తీవ్రమైన వ్యతిరేకత రావడంతో చల్లబడినట్లు అయ్యింది. 2019 శాసనసభ ఎన్నికలు ముగియగానే పాలికె ఎన్నికలు జరపాల్సి ఉండేది. అప్పట్లో కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలు సంయుక్తంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. అప్పట్లో కలిసి పాలికె ఎన్నికలకు వెళ్లాలని భావించారు. ఏడాదిన్నర పాలన ముగియగానే సంకీర్ణ ప్రభుత్వం పతనమైంది. 2020 సెప్టెంబర్‌లో బీబీఎంపీ పాలకవర్గం గడువు ముగిసింది. ఆవెంటనే ఎన్నికలు జరిపేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఎన్నికలకు వెళ్ళేందుకు ముందుగానే వార్డుల సంఖ్య పెంచాలనే ప్రతిపాదన బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చింది. ఇందుకు ఏడాదికి పైగా సమయం పట్టింది. 198 వార్డులను 243కు పెంచుతూ తీర్మానించారు. వార్డుల విభజన సక్రమంగా జరుగలేదని జనాభాకు అనుగుణంగా లేదని ఎవరికోసం ఇలాంటి విభజనలు తీసుకువచ్చారంటూ మాజీ కార్పొరేటర్‌లు కొందరు కోర్టును ఆశ్రయించారు. 243 వార్డులకు రిజర్వేషన్‌లను అప్పటి బీజేపీ ప్రభుత్వం ప్రకటించగా అందుకు కొందరు అభ్యంతరం తెలుపుతూ కోర్టుకు వెళ్ళారు. ఇలా ప్రతి అంశంలోను కోర్టులో అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో వాయిదాలు పడుతూనే వస్తున్నాయి. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వార్డుల పునర్విభజన చేసేందుకు ప్రయత్నించారు. చివరకు 224 వార్డులుగా ఖరారు చేశారు. ఇక ఎన్నికలు జరుగుతాయని భావించిన తరుణంలోనే కులగణన అంశం వచ్చింది. ఫిబ్రవరి నాటికి కులగణన నివేదికకు ఆమోదం తెలిపితే ఆవెంటనే ఎన్నికలు వస్తాయని భావించినా అంతలోనే లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో వాయిదా పడింది.



ఆసక్తి చూపని కార్పొరేటర్లు..

బెంగళూరు పాలికెలో కార్పొరేటర్‌లు ఉండటం ఎవరికీ ఆసక్తి లేదనే అంశం తరచూ చర్చకు వస్తుంటుంది. బెంగళూరు పాలికె పరిధిలో మూడు లోక్‌సభ స్థానాలతో పాటు బెంగళూరు గ్రామీణ పరిధిలోను పలు వార్డులు ఉన్నాయి. ఇక 28 శాసనసభా నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రతి ఎమ్మెల్యే నియోజకవర్గంలోను 6నుంచి9 మంది దాకా కార్పొరేటర్‌లు ఉంటారు. పాలకవర్గం లేని కారణంగా ప్రతి సమస్యా ఎమ్మెల్యేలు, ఎంపీల చెంతకే వెళుతోంది. ఇలా కార్పొరేటర్‌లు ఉంటే అన్నింటిని వారే పర్యవేక్షిస్తారనేది కూడా ఉంది. పైగా వేలాది కోట్ల రూపాయల అభివృద్ధి పనులు సాగుతుంటాయి. ఇలా పలు కారణలతో వాయిదాలకు కారణమవుతోందనే విమర్శలు ఉన్నాయి.

గతంలోనూ కోర్టు జోక్యంతోనే..

బెంగళూరు మహానగర పాలికెగా ఉన్నప్పటి నుంచి ఇదే తరహా వివాదాలు సాగుతున్నాయి. బృహత్ బెంగళూరు మహానగర పాలిక ఏర్పడినప్పటి నుంచి రెండుసార్లు కోర్టు జోక్యంతోనే ఎన్నికలు జరిగాయి. 2014లో పాలకవర్గం ముగియగానే బెంగళూరును మూడుగా విభజించాలనే ప్రస్తావన వచ్చింది. కానీ 2015లో ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం బెంగళూరును ఐదుగా విభజించాలనే ప్రతిపాదనలకు కన్నడ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అదే జరిగితే కన్నడిగులకు కాకుండా ఇతరలకు పదవులు దక్కుతాయని బెంగళూరును విభజించకుండానే ఎన్నికలు జరపాలంటూ కర్ణాటక రక్షణ వేదిక అధ్యక్షులు నారాయణ గౌడ డిమాండ్ చేశారు. ఇదే తరహాలోనే మరిన్ని సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

నివేదికపైనే అందరి దృష్టి

- 19 నియోజకవర్గాల్లో ఓటమిపై రాహుల్ పోస్టుమార్టం
- నేటి నుంచి డీసీఎం సమీక్షలు

బెంగళూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 19 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రాహుల్‌గాంధీ సూచించిన మేరకు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్ సిద్ధమయ్యారు. కేపీసీసీ కార్యాలయంలో శుక్రవారం నుంచి నిరంతరంగా సమీక్షలు జరపదలిచారు. రాష్ట్రంలో 28 లోక్‌సభ స్థానాలు ఉండగా కాంగ్రెస్ కనీసం 20 స్థానాల్లో గెలుపు సాధిస్తుందని భావించారు. అయితే కేవలం 9 స్థానాలకే పరిమితమైంది. నియోజకవర్గాల వారీగా ఓటమికి సంబంధించి సమగ్ర నివేదిక రూపొందించేందుకు డీకే శివకుమార్ సిద్ధమయ్యారు. డీకే శివకుమార్, సంబంధిత ఇన్‌చార్జ్ మంత్రులు, ముఖ్య నాయకులతో సమిష్టి నిర్వహించనున్నారు. ఏడాదిక్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో 135 ఎమ్మెల్యేలు గెలుపొందగా లోక్‌సభ ఎన్నికల్లో ఇంతతక్కువ సీట్లు ఎందుకు పరిమితమయ్యామని అధిష్ఠానం ప్రశ్నించినట్లు తెలుస్తోంది. రాహుల్‌గాంధీ ఇటీవల బెంగళూరు కోర్టుకు వచ్చిన సందర్భంలో ఓటమి చెందిన అభ్యర్థులు, గెలుపొందిన ఎంపీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇదే సందర్భంలోనే ఓటమికి ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. దీన్నిబట్టి నియోజకవర్గాలవారీగా నివేదిక పంపాలని రాహుల్‌గాంధీ సూచించారు. కేపీసీసీ అధ్యక్షుడి హోదాలో డీకే శివకుమార్ నివేదిక ఇవ్వనుండగా ముఖ్యమంత్రి హోదాలో సిద్దరామయ్య కూడా ఒక నివేదిక ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇద్దరి నివేదికలు బేరీజు వేసుకుని అధిష్ఠానం నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

సాగునీటి ప్రాజెక్టు పనులు వేగవంతం కావాలి

డీసీఎం డీకే శివకుమార్

రాష్ట్రంలో అమలులో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగవంతం కావాలని జలవనరుల శాఖ మంత్రిగా ఉన్న డీసీఎం డీకే శివకుమార్ ఆదేశించారు. గురువారం వికాససౌధలో ఉన్నతస్థాయి అధికారులతో సమీక్ష జరిపారు. రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ, అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె ఢిల్లీలో అధికార ప్రతినిధి టీబీ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు. దక్షిణకన్నడ జిల్లానుంచి కోలారు జిల్లాకు నీటిని మళ్లించే ఎత్తిపోతల పథకంతోపాటు ఎగువభద్ర, మేకెదాటు సహా పలు పథకాలకు సంబంధించి సమీక్ష జరిపారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగిసిందని, ఇక అభివృద్ధి పనులు వేగవంతం చేద్దామని సూచించారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు సాగునీరందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.



అధికారులతో సమావేశంలో డీసీఎం డీకే శివకుమార్

ఫిబ్రవరిలో ఇన్వెస్ట్ కర్ణాటక సదస్సు

బెంగళూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక వేత్తల నుంచి పెట్టుబడులు ఆకర్షించేందుకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఇన్వెస్ట్ కర్ణాటక సదస్సు నిర్వహించేందుకు మంత్రివర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. గురువారం విధానసౌధలో సీఎం సిద్ధరామయ్య అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జగింది. కేబినెట్‌లో తీర్మానాలను శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వివరించారు. 2025 ఫిబ్రవరి 12 నుంచి 14వరకూ ఇన్వెస్ట్ కర్ణాటక సదస్సు ప్యాలెస్‌మైదానంలో ఏర్పాటు చేసేందుకు తీర్మానించామన్నారు. ఏటా ఇన్వెస్ట్ కర్ణాటక ద్వారా కోట్లాది రూపాయల పెట్టుబడులు సాధ్యం అవుతోందని అదే రీతిన వచ్చే ఏడాది మరిన్ని దేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలను స్వాగతించదలచామన్నారు. ఇన్వెస్ట్ కర్ణాటక సదస్సు నిర్వహణకు రూ.25కోట్లు మంజూరు చేశామని మరో 15కోట్లు మంజూరు చేశామన్నారు. ఈఎస్‌ఐ శాఖను కార్మికశాఖలో విలీనం చేసే అంశాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. ఉత్తరకన్నడ జిల్లా భట్కళలో రూ.12 కోట్లతో కోర్టు భవనాల నిర్మాణాలకు మంజూరు చేశామన్నారు. రూ.46.48 కోట్లతో 112 బీఎస్-4 బస్సులను కొనుగోలుకు తీర్మానించామన్నారు. గనుల కాంట్రాక్టు ఒప్పందం గడువు ముగిసిన మేరకు భారత్ బంగారు గనుల సంస్థకు సంబంధించి

● మంత్రివర్గం తీర్మానం

తీర్మానాలకు సాంకేతిక పరంగా చర్చలకు మరో వారం వాయిదా వేశామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణలకు నాలెడ్జ్ పార్టనర్‌గా ఇ- టెండర్ ద్వారా బాస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ ఇండియా సంస్థకు రూ.21 కోట్లు చెల్లించి ఒప్పందం చేసుకునేందుకు అంగీకరించామన్నారు. ఏడవ వేతన కమీషన్‌కు సంబంధించి చర్చలు జరుగలేదన్నారు. పాలనా వ్యవహారాలు వేగవంతం చేసేందుకు, జనస్నేహిగా ఉండేందు కోసం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు, ముఖ్యకార్యదర్శులతో ప్రత్యేక సమావేశం జరిపేందుకు తీర్మానించామన్నారు.



మెట్రో స్టేషన్‌లో వేచివున్న ప్రయాణికులు

తెరుచుకోని మెట్రో తలుపులు

బెంగళూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నమ్మ మెట్రో రైలు ప్రయాణికులు గంటన్నర పాటు తల్లడిల్లిపోయారు. మెజిస్టిక్ నుంచి వైట్‌ఫీల్డ్ వైపున ఉండే ఐటీ కంపెనీలతో పాటు ఇతరత్రా పనుల కోసం బయలుదేరిన వారు ఇబ్బంది పడ్డారు. గురువారం ఎంజీ రోడ్డుకు అనుబంధంగా ఉండే ట్రినిటీ మెట్రోస్టేషన్‌కు మెట్రో రైలు చేరుకునేసరికి సుమారు 9.58గంటలయ్యింది. రైలు ఆగడంతో ప్రయాణికులు దిగేందుకు సిద్దమయ్యారు. తలుపులు తెరుచుకోక పోవడంతో ఎటూ కదలలేకపోయారు. ఒక భోగీలోని తలుపులు పూర్తిగా మూసుకుపోయాయి. ప్రయాణికులు ఎటూ వెళ్ళే పరిస్థితి లేకుండా పోయింది. లోకోపైలెట్‌లు వెంటనే మెట్రో సాంకేతిక విభాగానికి ఫిర్యాదు చేశారు. అయితే వారు చేసిన ప్రయత్నం ఫలించలేదు. దీంతో ఆ రైలును మెజిస్టిక్ మెట్రో స్టేషన్‌కు తరలించారు. అక్కడ



● గంటన్నరపాటు ప్రయాణికుల అవస్థలు

టెక్నికల్ ఇంజనీర్లు తలుపులు తెరిచారు. దీంతో ప్రయాణీకులు బయటపడ్డారు. సుమారు గంటన్నరపాటు ప్రయాణకులు మెట్రోలోనే ఉండాల్సి వచ్చింది. సాంకేతికంగా జరిగిన పొరపాటుకు మెట్రో అధికారులు క్షమాపణలు కోరారు. ఆతర్వాత యథావిధిగా మెట్రో సంచారం సాగుతోంది. ఉదయమే కార్యాలయాలు, సంస్థలకు వెళ్లే వారు సమయం వృథా కావడంతో ఇబ్బంది పడ్డారు. దాదాపు గంటన్నరపాటు కెంగేరి- వైట్‌ఫీల్డ్ స్టేషన్‌ల మధ్యన రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రతి స్టేషన్‌లోనూ వేలాది మంది పడిగాపులు పడ్డారు.

చారిత్రక కట్టడాలు

ఇక కనుమరుగు..!

- అభివృద్ధి పేరుతో నేలకూలుస్తున్న అధికారులు
- బళ్లారి ఖ్యాతి దెబ్బతింటుందంటున్న చరిత్రకారులు

బళ్లారి గాంధీనగర్, జూన్ 13: నగరంలోని బ్రిటీషుల కాలం నాటి కట్టడాలు ఒక్కొక్కటే నేల కూలుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు నగరంలో తమ హయాంలో నగరంలో ఈ అభివృద్ధి జరిగిందని చూపించుకోవడానికి పురాతన కట్టడాలు కూల్చి.. వాటి స్థానంలో మరోకట్టడం నిర్మించే పని మొదలెట్టారు. కొన్నేళ్ళుగా...నగరంలో ఇదొక సంప్రదాయంగా కొనసాగుతూ వస్తోంది. గతంలో వందేళ్ళ చరిత్ర ఉన్న టవర్ క్లాక్ ను రాత్రికి రాత్రి కూల్చిన విషయం తెలిసిందే. దీని వెనుక ఎవరున్నారనే విషయం నగర అందరికీ తెలిసినా... అధికారిక రికార్డుల్లో మాత్రం టవర్‌క్లాక్ మాయం అనే ఫిర్యాదు పోలీసుల రికార్డుల్లో అలాగే ఉండి పోయింది. కట్టడం కూలి 13 ఏళ్ల గడుస్తున్నా... టవర్‌క్లాక్ ఎక్కడికి వెళ్ళింది? ఎలా కూలిందనే విషయం ఇంతవరకు బహిరంగ రహస్యంగానే మిగిలిపోయింది. ప్రస్తుతం ఆ స్థానంలో మరో బృహత్ టవర్‌క్లాక్ నిర్మాణ దశలో ఉంది. ఇది ఇలా ఉండగా... బ్రిటీషు కాలంలో మద్రాస్ ప్రెసెన్సీలో రెండో మున్సిపాల్టీగా పేర్కొందిన బళ్ళారి నగరం నడిబొడ్డున ఉన్న ఈ పాతమున్సిపల్ కార్యాలయ నిర్మాణాన్ని కూల్చేందుకు ప్రస్తుతం కార్పొరేషన్ పాలక మండలి సిద్ధమయ్యింది. మద్రాస్ ప్రెసిడెన్సీలో ఆంధ్రా కర్ణాటక రాష్ట్రాలకు వారధిగా నిలిచిన బళ్లారి జాతీయ స్థాయిలో పేరొందడాన్ని బళ్ళారి ప్రజలు గర్వకారణంగా చెప్పుకుంటారు. బ్రిటీషు కాలంలో బళ్ళారిలో ప్లేగు వ్యాధి కారణంగా సుమారు 10వేల మందికి పైగా మృత్యువాత పడినట్లు చరిత్ర చెబుతోంది. అప్పటికే మున్సిపాలిటీ హోదా ఉన్న బళ్ళారి మున్సిపాలిటీకి మొదటి సారిగా అధ్యక్షులుగా ఎన్నికై ప్లేగుబారిన నిరుపేద ప్రజలకు సేవలు అందించారు. ఆ సమయంలో ప్లేగు వ్యాధి బాధితులకు వైద్యం అందించేందుకు అవసరమైన ఆసుపత్రి లేకపోవడంతో ప్రజల నుండి విరాళాలు సేకరించి ఆసుపత్రి నిర్మించారు.

● అదే సమయంలో కోలాచలం వెంకటరావ్ మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్ మెంబరుగా 1903-1904 పనిచేశారు. ప్రస్తుతం ఉన్న స్థలంలో 1903 సంవత్సరంలో ప్లేగు వ్యాధి బాధితులకు వైద్యం అందించేందుకు ఆసుపత్రిని నిర్మించారు. అనంతరం అదికాస్త బళ్లారి మున్సిపాలిటీ కార్యాలయంగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి 2006 వరకు ఇదే కట్టడంలోనే మున్సిపాల్టీ పాలనావర్గం కార్యకలాపాలు సాగించింది. అనంతరం బళ్ళారి మహానగర పాలికెగా హోదా పొందిన తరువాత ప్రస్తుతం ఉన్న కట్టడంలో తన కార్యకలాపాలు మార్చినా... ఇంకా ఇదే కట్టడంలోనే కార్పొరేషన్‌కు చెందిన రెవెన్యూ, ఇతరత్ర విభాగాలు నగర ప్రజలకు సేవలు అందిస్తున్నాయి ప్రస్తుతం బళ్ళారి నగరానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులు నగరం రూపురేఖలు మార్చేందుకు నడుం బిగించారు. ఇందులో భాగంగానే ఈ కట్టడాన్ని కూల్చేందుకు కార్పొరేషన్ పాలక మండలి సమావేశంలో రెజల్యూషన్ పాస్ చేశారు. ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో కట్టడం కూల్చివేత వాయిదాపడింది. ఈ విషయంపై కార్పొరేషన్ అధికారులు, నగర సీనియర్ సిటిజన్‌ల నుండి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అభివృద్ధి పేరుతో పురాతన కట్టడాలను కూల్చుకుంటూ పోతే భవిష్యత్ తరాలకు బళ్ళారి నగర చారిత్రక వైభవం ఎలా తెలుస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న సిబ్బందికి అవసరమైన మౌలిక సౌకర్యాలు లేవు... ఉన్నఫళంగా పాత మున్సిపాల్టీ కట్టడాన్ని కూల్చితే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది అభివృద్ధి పేరుతో బీజేపీ ప్రజా ప్రతినిధులు పాత మార్కెట్‌ను కూల్చారు. అయితే ఆ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టకపోవంతో స్థానిక ప్రజలు ప్రజా ప్రతినిధులపై పెదవి విరుస్తున్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు కూడా అదేబాటలో సాగుతూ... కట్టడాల కూల్చివేయడం సరికాదని సీనియర్ సిటిజన్లు అభిప్రాయ పడుతున్నారు. అభివృద్ధికి ఎవరూ అడ్డుకాదని... పురాతన కట్టడాలను పరిరక్షిస్తూనే... అభివృద్ధికి బాటలు వేయడం సరైన మార్గమనేది.. నగర ప్రజలు అంటున్నారు. ఈ కట్టడానికి సంబంధించి శిలాశాసనం ఇప్పటికీ అదే ప్రాంగణంలో చెక్కుచెదర కుండా ఉంది. ఆ శిలాఫలకంలో ప్రజల విరాళాలతో 1903 సంవత్సరంలో ఆసుపత్రి నిర్మాణం జరిగిందని, అప్పటి తాహసీల్దారు, రావ్ బహదూర్ ఆదిరెడ్డి పర్యవేక్షణలో ఈ నిర్మాణం జరిగినట్లు రాతిబండపై చెక్కబడి ఉంది.

కూల్చివేతకు తీర్మానం


నగరంలో ప్రధాన సర్కిల్ అభివృద్ధిలో భాగంగా రాయల్ సర్కిల్ ప్రాంతంలో ఉన్న పాత మున్సిపల్ కట్టడాన్ని కూల్చివేయసి దాని స్థానంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ ఖలీల్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రస్తుతం పాలక మండలి నుంచి అంగీకరం లభించినట్లు వివరించారు. ప్రస్తుతం పాత మున్సిపల్ కార్యాలయంలో ఉన్న రెవెన్యూ, ఇతర విభాగా లను కొత్త కార్యాలయంలోకి బదిలీ చేస్తున్నట్లు వారంలోగా పాత మున్సిపల్ కార్యాలయాన్ని తొలగించే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.



బ్రిటీషు వారి కాలంలో నిర్మించిన బళ్ళారి మున్సిపల్ కార్యాలయం



1903 సంవత్సరంలో ప్రజల విరాళాలతో ఆసుపత్రి నిర్మించినట్లు తెలిపే శిలాశాసనం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,580	1,581.08
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	4024	139
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	08	247
సామర్థ్యం (టీఎంసీలు)	4.9	5.02

ఏళుపడగల నాగప్ప హుండీ లెక్కింపు



ఆలయంలో హుండీ లెక్కిస్తున్న దృశ్యం

కంప్లి, జూన్ 13 : బుక్కసాగర వద్ద ప్రసిద్ధి గాంచిన ఏళుపడగల నాగప్ప ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు జరిగింది. మొత్తం రూ. 2,10,377లు ఆలయానికి ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారి హనుమంతప్ప మాట్లాడుతూ నాగప్ప దేవాలయానికి వచ్చే భక్తాదులకు గదులు, తాగునీరు, మౌలిక వసతులు ఏర్పాటుచేశామని, త్వరలో ప్రహరీగోడను నిర్మించి మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.

అంగన్‌వాడీల నిరసన



ఎమ్మెల్యే కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న కార్యకర్తలు

సిరుగుప్ప, జూన్ 13 : ఎల్‌కేజీ, యుకేజీ తరగతులు అంగన్‌వాడీలకు ఇవ్వకపోవడం సరైంది కాదని సీఐటీయు నాయకురాలు ఉమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేఆర్‌పీఐడీ పథకాన్ని అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సిరుగుప్ప పట్టణంలో గురువారం సీఐటీయు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వ్యాయామశాల నుంచి ఎమ్మెల్యే ఇంటి వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కార్యదర్శి బసవరాజుకు వినతి పత్రం అందజేశారు. శిక్షణ లేకుంటే చిన్న పిల్లలకు విద్యాబోధన చేయడం కష్టతరంగా మారుతుందన్నారు. తక్షణమే ఈ పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, యల్లమ్మ, దుర్గమ్మ, మహేశ్వరి, వందలాది మంది అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

గుంతలో ఇరుక్కుపోయిన బస్సు



రోడ్డు మధ్యలో ఇరుక్కున్న కేఎస్ఆర్టీసీ బస్సు

కంప్లి, జూన్ 13 : కుడితిని, తిమ్మలాపురం మధ్య కేపీసీఎల్ వద్ద కంప్లి నుంచి గంగావతికి వెళుతున్న కేఎస్ఆర్టీసీ బస్సు గురువారం రోడ్డులో ఇరుక్కుపోయింది. దీంతో అరగంటపాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నోసార్లు ఈ ప్రాంతంలో ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఆ ప్రాంతాల్లో మరమ్మతులు చేయించి ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాలని కోరారు. అలాగే ఈ విషయంపై ఎంపీ తుకారామ్‌కు, కేపీసీఎల్ అధికారులకు తెలిపామన్నారు. కేపీసీఎల్ నుండి కుడితిని వరకు సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరినా వారికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో మోకాలిలోతు గుంతలు ఏర్పడటంతో ఎటు వెళ్లాలో తెలియక డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు.

తిమ్మప్పకు నివాళులర్పించిన ప్రముఖులు

కంప్లి, జూన్ 13 : కుడితిని రైతుగా పేరుపొందిన విఠలాపుర తిమ్మప్పకు కుడితిని పట్టణంలో ప్రముఖులు నివాళులర్పించారు. బళ్లారి, హొస్పేట, కంప్లి, సండూరు, తదితర పట్టణాల నుంచి ప్రముఖులు, రైతులు పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు తిమ్మప్ప భార్య గీతమ్మ, కుమారులు కృష్ణ, రాజశేఖర్, రాము, శ్రీదేవి,సుశీల, మాధవి, మనవళ్లు, మనవరాళ్లు, కుటుంబీకులు ఆయనకు నివాళులర్పించారు.

మేయర్ అభ్యర్థి ఎంపికపై
కాంగ్రెస్ మల్లగుల్లాలు



కార్పొరేటర్లతో చర్చిస్తున్న డీసీసీ జిల్లా అధ్యక్షులు అల్లం ప్రశాంత్, సిటీ ఎమ్మెల్యే

- ఆసక్తికరంగా బళ్లారి మేయర్ రాజకీయం
- పోటీలో ఉన్నామంటున్న ముల్లంగి నందీష్ బాబు, ముండ్లూరు ప్రభంజన్, గాదెప్ప, పేరం విక్కీలు
- అందరి అభిప్రాయాలను కేపీసీసీకి పంపుతామన్న డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్

బళ్లారి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బళ్లారి మేయర్ అభ్యర్థి ఎంపిక కోసం గురువారం గాంధీనగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు అల్లం ప్రశాంత్, బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అధినాయకుల ఆదేశాల ప్రకారం కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 21న మేయర్, ఉప మేయర్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌లో అందుబాటులోఉన్న కార్పొరేటర్లతో నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఒకరిద్దరు కార్పొరేటర్లు మినహా మిగిలిన కార్పొరేటర్లు అందరూ హాజరయ్యారు. నాయకులు డీసీసీ అధ్యక్షులు అల్లం ప్రశాంత్, ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి కార్పొరేటర్ల అభిప్రాయాలను సేకరించారు. మేయర్ పదవిని ఆశిస్తున్న వారు వారి అభిప్రాయాలను తెలియజేయాలన్నారు. మేయర్ పదవిని ఆశిస్తూ ముల్లంగి నందీష్ బాబు, ముండ్లూరు ప్రభంజన్, గాదెప్ప, పేరం విక్కీలు మేయర్ పదవిని ఆశిస్తున్నట్లు తెలిపారు. ముల్లంగి నందీష్ బాబు తన అభిప్రాయం చెబుతూ గతంలో తాను బీజేపీ అధికారంలో వున్నప్పుడు అప్పటి ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి కుమారుడిపై గెలిచానని, అలాగే గతంలో అల్లంభవన్‌లో సమావేశం నిర్వహించినప్పుడు ఎంపీ నాజిర్ హుస్సేన్, మంత్రి నాగేంద్ర, ప్రస్తుత స్పీకర్ యుటీ ఖాదర్ ముఖ్య నాయకులు కలసినప్పుడు తనకు మేయర్ పదవి ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆ నాటి మాట ప్రకారం తనకు మేయర్ పదవి ఇవ్వాలని కోరారు. ముండ్లూరు ప్రభంజన్ మాట్లాడుతూ ఇంతకాలం పార్టీ కోసం కష్టపడ్డానని, ఆ నాటి నుంచి ఈ నాటి వరకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెజార్టీ తీసుకువచ్చానన్నారు. డిప్యూటీ సీయం శివకుమార్ చెప్పినట్లు పార్టీలో కష్టపడే వారికే పదవులిస్తామన్నారని కావున తనకు మేయర్ పదవి ఇవ్వాలని కోరారు. గాదెప్ప తాను సీనియర్‌ను కనుక తనకు ఇవ్వాలని అడిగారు. పేరం విక్కీ కూడా పార్టీలో చాలా యేళ్లుగా పనిచేశామని తనకు టికెట్ ఇవ్వాలని కోరారు. వీరి అభిప్రాయాలను సేకరించి డీసీసీ నుంచి కేపీసీసీకు పంపుతామని డీసీసీ అధ్యక్షులు అల్లం ప్రశాంత్ తెలిపారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి వుండాలని చెప్పారు. మొత్తంమీద బళ్లారిలో మేయర్ రాజకీయం ఆసక్తికరంగా మారింది. మేయర్ ఎన్నికలపై రాజకీయంగా విస్తృత చర్చసాగుతోంది.

ఆంజనేయుడి విగ్రహం ధ్వంసం



ఆంజనేయుడి మూతి భాగాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

బళ్లారి సిటీ, జూన్ 13: విజయనగరం తాలూకా కొత్త హంపి గ్రామంలో దుండగులు ఆంజనేయ విగ్రహాన్ని ధ్వంసచేసిన ఘటన చోటుచేసుకుంది. కొత్త హంపిలోని కార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవస్థానంలో విగ్రహాన్ని తాగిన మైకంలో ఆగంతకులు ధ్వంసం చేసి ఉంటారని, లేక మానసిక వ్యాధిగ్రస్థులు ఈ పనికి పాల్పడిఉంటారని అనుమానిస్తున్నారు. హొసపేట డిఎస్పీ శరణబసవేశ్వర, హంపి టూరిస్ట్ స్టేషన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి పలుకోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిరుగుప్ప తహసీల్దార్‌గా విశ్వనాథ్

సిరుగుప్ప, జూన్ 13 :సిరుగుప్ప నూతన తహసీల్దార్‌గా హెచ్. విశ్వనాథ్ అధికార బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందున్న తహసీల్దార్ షంషాలంను వేరే ప్రాంతానికి బదిలీ చేయడంతో ఆ స్థానంలో విశ్వనాథ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విలేజ్ అకౌంటెంట్‌ల సంఘం అధ్యక్షులు విరుపాక్షి నూతన తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

ధర లేక ఉల్లి రైతు కన్నీరు

బళ్లారి సిటీ, జూన్ 13: ఎండకాలంలో కరెంటు సమస్య, నీళ్ల కొరతల మధ్య సాగు చేసిన ఉల్లి పంటకు మరింత ధర వస్తుందని ఆశించిన రైతులకు నిరాశ ఎదురైంది. మార్కెట్ ధర పతనం కావడంతో నష్టాల పాలయ్యారు. సీజన్‌లో ఉల్లి ధర క్వింటాల్‌కు రూ. 1100 నుంచి రూ.1200వరకు నిలువునా పడిపోయింది. మార్కెట్‌లో ఉల్లి పంట ధర పెరగకపోవడం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. స్థానికంగా విక్రయిస్తే లాభమని రైతులు భావించినా ధర పెరుగుతుందనే ఆశతో పలువురు సరుకును తమ వద్దే నిల్వ ఉంచుకున్నారు.



సంచుల్లో నిల్వ ఉంచిన ఉల్లి

-ఆశించిన ధర రాలేదు

బోర్‌వెల్ ఉన్న రైతులు వేసవిలో ఉన్న నీటినే ఉల్లి సాగుకు వినియోగించుకున్నారు. విత్తనం ఎరువులు, మందులు, కూలీలు కలిపి ఎకరానికి రూ.25నుంచి 30వేలు ఖర్చు చేశారు. కానీ ఇప్పుడున్న ధరకు విక్రయిస్తే నష్టపోతారు. అలాగని నిల్వచేయడం కూడా కష్టమే. మార్కెట్‌లో ఆశించిన మేరకు ధర లేకపోవడంతో ఉల్లి సాగు చేసిన రైతులు కుంగుతిన్నారు. పంటకు వెచ్చించిన డబ్బులు వస్తే చాలని భావిస్తున్నారు. కానీ పడిపోతున్న ఉల్లి ధర ఇంత వరకు పెరగకపోవడం రైతుల చేత కంటతడి పెట్టించింది.

-1133.49 హెక్టార్లలో పంట

తాలూకాలోని కోగలి పరిధిలో 367.36 హెక్టార్లు, కొట్టూరులో 1133.49 హెక్టార్లలో బోర్‌వెల్ నీటి సహాయంతో రైతులు చలికాలంలో ఉల్లిని సాగు చేశారు. సాధారణంగా ఉల్లి ఎకరాకు 85 నుండి 90 క్వింటాళ్ళు పండుతుంది. రూ.4వేలుదర వస్తుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. ప్రస్తుతం క్వింటాల్ రూ.1100 నుంచి 1200 ధర పలుకుతోంది. బెంగళూరు మార్కెట్‌కు వెళ్ళి విక్రయించడం కష్టం. దీంతో రైతులు స్థానిక మార్కెట్‌లో తక్కువ దరకు విక్ర యిస్తున్నారని, ధర పెరుగుతుందనే అంచనాతో చాలా మంది సరుకు నిల్వ ఉంచుకున్నారని, రైతు నాగరాజు,కె.అయ్యనహళ్ళి తెలిపారు.

ఏపీఎంసీ అధ్యక్షుడిగా కట్టెమనె నాగేంద్రప్ప ప్రమాణ స్వీకారం



కట్టెమనె నాగేంద్రప్పను అభినందిస్తున్న పార్టీ ప్రముఖులు...

బళ్లారి గాంధీనగర్, జూన్ 13: బళ్లారి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సమితి (ఏపీఎంసి) నూతన అధ్యక్షుడిగా కట్టెమనె నాగేంద్రప్ప గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు అల్లం ప్రశాంత్‌తో పాటు మాజీ కార్పొరేషన్ మేయర్ రాజేశ్వరిలతో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు రామ్‌ప్రసాద్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏపీఎంసికి చేరుకుని ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగేంద్రప్ప మాట్లాడుతూ, రైతు కుటుంబంలో పుట్టిన తనకు రైతుల కష్టాలు తెలుసునని, రైతులు పండించిన పంటను మార్కెట్‌కు తీసుకొచ్చిన సమయంలో ఎదుర్కొంటున్న కష్టాలను తాను అనుభవించానని, వాటన్నింటిని దృష్టిలో పెట్టుకుని మార్కెట్‌కు వచ్చిన రైతుల ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

కమ్మసంఘం ఆధ్వర్యంలో సన్మానం

బళ్లారిరూరల్, జూన్ 13 : బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌లో గురువారం నూతనంగా అధ్యక్షుడు అయిన కట్టెమనె నాగేంద్ర, బళ్లారి ఎమ్మెల్యే భరత్ రెడ్డిలకు బళ్లారి కమ్మసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమ్మ సంఘం నాయకులు జి ప్రభాకర్ నాయుడు, బాబు ప్రకాష్, ఎస్ వెంకటనాయుడు, ముండ్లూరు విజయ్‌కుమార్, ముండ్లూరు అజయ్‌కుమార్, టి సురేష్, ఆర్ అంజనేయులు, ముండ్లూరు చిట్టి (నారాయణ స్వామి), ముండ్లూరు ప్రభంజన్, కార్పొరేటర్ విక్కి, వైశీన, అలివేలు సురేష్, మాజీ మేయర్ రాజేశ్వరి, బోయపాటి విష్ణు తదితరులు కలసి వీరికి పూలమాలలు వేసి సన్మానించారు.

1008 ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ

- గుల్బర్గా విభాగ అడిషనల్ డైరెక్టర్ ఆకాష్



అడిషనల్ కమీషనర్ డా.ఆకాష్

బళ్లారి గాంధీనగర్, జూన్ 13: గుల్బర్గా పరిధిలోని 1008 ప్రాథమిక పాఠశాలల్లో పూర్వప్రాథమిక (ఎల్‌కెజి, యుకెజి) తరగతుల ప్రారంభానికి అనుమతి ఇచ్చినట్లు విద్యాశాఖ అడిషనల్ కమీషనర్ డాక్టర్ ఆకాష్.ఎస్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచే ఉద్దేశంతో ఈ విధంగా పూర్వప్రాథమిక తరగతులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

బీదర్ జిల్లాలో 98, బళ్ళారి జిల్లాలో 119, గుల్బర్గా జిల్లాలో 234, కొప్పళ 131, రాయచూరు 190, విజయనగర 142, యాదగిరి జిల్లాలో 94తో చేరి కళ్యాణ కర్ణాటక విభాగంలో మొత్తం 1008 పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కళ్యాణ కర్ణాటక ప్రాదేశిక అభివృద్ధి మండలి అక్షర ఆవిష్కార కార్యక్రమం ద్వారా వీటిని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. గుల్బర్గా విభాగంలోని 967 పాఠశాలల్లో 32,805 పిల్లలు ప్రవేశం పొందగా గుల్బర్గా విభాగంలో 70.93శాతం పిల్లలు అంగనవాడీ కేంద్రాలపై ఆధారపడి ఉన్నట్లు తెలుస్తోందన్నారు. పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించడం ద్వారా అంగనవాడి కేంద్రాలపై భారం తప్పనున్నట్లు వివరించారు. ఈ విద్యావిధానం అమలుకు కేంద్రం నుండి అధికంగా నిధులు వస్తాయని తెలిపారు.

21న యోగా దినోత్సవానికి ఏర్పాట్లు : డీసీ

బళ్లారి సిటీ, జూన్ 13: జిల్లాలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జూన్ 21న అర్థవంతంగా నిర్వహించాలని అందుకు అవసరమైన సన్నాహాలు చేయాలని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాకలెక్టర్ కార్యాలయ హాల్లో గురువారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకునేందుకు వివిధ శాఖలకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. రుతుపవనాల నేపథ్యంలో పరిస్థితిని బట్టి యోగా దినోత్సవ కార్యక్రమం ఎక్కడ జరుగుతుందో ఆ తర్వాత ప్రకటిస్తామని చెప్పారు. ఉదయం 6గంటల నుంచి యోగా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, మొదట యోగా వేదిక కార్యక్రమం అనంతరం యోగా కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగే కార్యక్రమానికి ఎక్కువ మంది హాజరయ్యేలా ప్రచారం నిర్వహించాలన్నారు. పతంజలి యోగా సెంటర్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సహా యోగా కేంద్రాలు సహకరించాలన్నారు. పాఠశాలలు,న కళాశాలలు, హాస్టళ్లలోని విద్యార్థులు యోగా కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. యోగా దినోత్సవ కార్యక్రమానికి వచ్చే వారికి తేలికపాటి అల్పాహారం, నీటి సౌకర్యం యోగాకు గ్రీన్‌మ్యాట్, లౌడ్‌స్పీకర్ వ్యవస్థ ఆవరణలో పూర్తి పరిశుభ్రత ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం క్రమశిక్షణతో చేపట్టి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కన్నులపండువగా ఎర్రితాత పూల రథోత్సవం



చేలగుర్కి వీధుల్లో సాగుతున్న ఎర్రితాత స్వామి పూల రథోత్సవం

బళ్లారిరూరల్, జూన్ 13 : తాలుకాలోని చేళగుర్కి ఎర్రితాత పూల రథోత్సవాన్ని గురువారం అశేష భక్తుల నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటకలోని బళ్లారి, ఉరవకొండ తదితర ప్రాంతాల నుంచి భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ పూల రథోత్సవాన్ని ఆలయం నుంచి ఎదురు బసవన్న దేవస్థానం వరకు నిర్వహించారు. ఈ రథోత్సవాన్ని మంగళవాయిద్యాలతో పాటు డ్రమ్ములు వాయిస్తూ కన్నుల పండువగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు బాలనగౌడ తెలిపారు.

హోసూరు జోన్

ప్రభుత్వ పథకాలపై ఫొటో ఎగ్జిబిషన్



ఫొటో ప్రదర్శనను వీక్షిస్తున్న ప్రజలు

హోసూరు(కృష్ణగిరి) జూన్ 13: కృష్ణగిరి జిల్లాలోని అన్ని శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలు, సంక్షేమ సహాయాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వార్తా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంల్లో కృష్ణగిరి పంచాయతీ యూనియన్, నరాలపల్లి పంచాయతీ, మహారాజగడ గ్రామాల్లో గురువారం ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఫోటో ఎగ్జిబిషన్‌లో తమిళనాడు ప్రభుత్వం పీపుల్ మెడిసిన్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, హోమ్ సీకింగ్ ఎడ్యుకేషన్, ఇన్నోవేటివ్ ఉమెన్ స్కీమ్, ముఖ్యమంత్రి అల్పాహార పథకం, ఆర్టిస్ట్ ఉమెన్ రైట్స్ గ్రాంట్ స్కీమ్, 108 అంబులెన్స్ సేవలు వంటి పలు ప్రత్యేక ప్రాజెక్టుల గురించి వివరించారు. ఈ ఫోటో ఎగ్జిబిషన్‌ను 300 మందికి పైగా సందర్శించారు.

వాంతులతో ఆసుపత్రిలో చేరిన రోగులకు చికిత్స



చికిత్స పొందుతున్నవారికి పరామర్శ

హోసూరు జూన్ 13 :హోసూరు కార్పొరేషన్ 4 వ వార్డు చిన్న యళసగిరిల్లోని అంబేద్కర్ కాలనీల్లో మహిళలు సహ 15 మంది వాంతులు చేసుకుని ప్రభుత్వాసుపత్రిలో చేరారు. ఈ విషయం తెలుసుకున్న మేయర్ సత్య సబ్ కలెక్టర్ ప్రియంక, కార్పొరేషన్ కమీషనర్ స్నేహా, డిప్యూటీ మేయర్ ఆనందయ్య తదితర ప్రముఖులు అక్కడికి చేరుకున్నారు. చికిత్స పొందుతున్న వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. తాగునీరు వల్ల ఆరోగ్యం దెబ్బతింటున్నదని తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సమష్టి పోరాటానికి సిద్ధం కావాలి



విలేకరులతో మాట్లాడుతున్న పారసమల్ సుఖాణి

రాయచూరు, జూన్ 13: వెనకబడిన కల్యాణ-కర్ణాటక ప్రాంతంలో నిరుద్యోగులకు విద్యార్థులకు న్యాయం జరిగే దిశగా చట్టరూపం దాల్చిన ఆర్టికల్ 371(జే) రద్దు కోసం జరుగుతున్న ప్రయత్నాన్ని ముక్త కంఠంతో ఎదిరించాలని తారానాథ విద్యసంస్థల చైర్మన్ పారసమల్ సుఖాణి కోరారు. ఆర్టికల్ 371(జే) చట్టాన్ని కాపాడుకునేందుకు పార్టీలకు అతీతంగా సమష్టి పోరాటానికి అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నగరంలో గురువారం ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆర్టికల్ 371(జే)కు సంబంధించి కేవలం ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల్లో విద్యార్థులకు రిజర్వేషన్‌లు మినహా ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో ఎలాంటి న్యాయం జరగకపోగా ఆర్టికల్ 371(జే) అమలులో అనేక సవాళ్లు ఎదురయ్యాయన్నారు. వీటన్నిటిని పరిష్కరించి ఆర్టికల్ 371(జే)ను సమర్థంగా అమలు చేయాలని ఒకవైపు ఈ ప్రాంతం వాసులు డిమాండ్ చేస్తుంటే మరోవైపు ఆ రిజర్వేషన్ సౌకర్యాన్ని రద్దు చేసే కుట్ర జరుగుతున్నట్లు ఆయన ఆరోపించారు. ఈ విషయంలో కేంద్రానికి ఎలాంటి లేఖ రాయలేదని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ చెబుతున్నప్పటికి ఆయన లేఖ రాసినట్లు అనుమానం ఉందని సుఖాణి స్పష్టం చేశారు.

బక్రీద్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

రాయచూరు, జూన్ 13 : ఈ నెల 17వ తేదీన జిల్లా కేంద్రంలో జరుపుకునే బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉమేశ్ కాంబ్లె సూచించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని గురువారం నగరంలోని సదర్ బజార్ పోలీస్ స్టేషన్‌లో శాంతిసభ నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన ఉమేశ్ కాంబ్లె, శాంతియుత సహజీవనానికి సోదరభావానికి ప్రతీకగా ఉండే రాయచూరు నగరంలో జరిగే అన్ని పండుగలు సుహృద్భావ వాతావరణంలో జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. అదే పద్ధతిని కొనసాగిస్తు ఈ ఏడాది సహితం పండుగను శాంతియుత వాతావరణంలో శాంతిభద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా జరుపుకోవాలన్నారు.

ఎమ్మెల్యేల ఇళ్ల ముందు అంగన్‌వాడీల నిరసన

- ఎల్‌కేజీ,యూకేజీ తరగతుల నిర్ణయం ఉపసంహరించాలని డిమాండ్



వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

రాయచూరు, జూన్ 13 :ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఎల్‌కేజీ,యూకేజీ తరగతులు ప్రారంభించాలని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించాలని అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హెచ్.పద్మా డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే నాల్గు, ఆరు సంవత్సరాల వయస్సున్న బాలలను ఎల్‌కేజీ, యూకేజీ పేరుతో పాఠశాలల్లో చేర్పించడం వల్ల అంగన్‌వాడీల పనితీరు ప్రశ్నార్థకమైయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తు గురువారం నగరంలోని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్, రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడల నివాసం ముందు అంగన్‌వాడీలు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన పద్మా ఇప్పటికే పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాతమిక శిక్షణ పేరుతో విద్యార్థులకు ఎల్‌కేజీ,యూకేజీ తరగతులను బోధించాలని గతంలో నిర్ణయించగా వాటిని అభివృద్ధి చేయకుండా విద్యార్థులందరిని నేరుగా పాఠశాలలకు పంపడం వల్ల వారికి పౌష్టిక ఆహారం లభించే అవకాశం ఉండదన్నారు. పౌష్టిక ఆహార లోపాన్ని నివారించడమే ప్రధాన లక్ష్యంగా ఏర్పాటైన అంగన్‌వాడీల ఉనికిని దెబ్బతీయకుండా ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని కోరారు.

తాగునీటి సమస్యపై సీఎంకు ఎమ్మెల్యేల వినతి




సీఎంకు లేఖ అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

రాయచూరు, జూన్ 13 : జిల్లాలో తలెత్తిన తాగునీటి సమస్య పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రిని కోరారు. గురువారం బెంగళూరులో సీఎం సిద్ధరామయ్యను కలిసి ఎమ్మెల్యేలు లేఖ అందజేశారు. సింగటలూరు జలాశయం నుంచి తుంగభద్ర జలాశయానికి 1.5 టీఎంసీల నీటిని విడుదల చేయడం ద్వారా జిల్లాలో ఇప్పటికే తీవ్ర రూపం దాల్చిన తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కాగా జిల్లాలో నెలకొన్న తాగునీటి ఎద్దడితో ప్రజలకు ఎదురవుతున్న సమస్య గురించి ప్రజాప్రతినిధులు సీఎం దృష్టికి తెచ్చారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

చైతన్య మహాప్రభు (వర్ధంతి)



శ్రీచైతన్య మహాప్రభు 1846 ఫిబ్రవరి 18న పశ్చిమబెంగాల్ నవద్వీప్‌లో జన్మించారు. ఆయన జయంతిని 'గౌర పూర్ణిమ' (ఫాల్గుణ పౌర్ణమి)గా వ్యవహరిస్తారు. వల్లభాచార్యుడి సమకాలీకుడైన ఆయన 'రాధాకృష్ణ' సంప్రదాయాన్ని పరాకాష్టకు తీసుకెళ్లిన మహాభక్తుడు. 'హరే కృష్ణ' సంకీర్తనను విస్తృతం చేశారు. చైతన్య సంప్రదాయానికి చెందిన వేదాంతాన్ని 'అచింత్య భేదా భేద వాదం' అని అంటారు. మతపరంగా దీనికి 'గౌడీయ వైష్ణవం' అని కూడా పేరు. చైతన్యుడి జ్ఞాన మీమాంస, ధార్మిక బోధనలు పది ఉన్నాయి. వీటినే 'దశమూల బోధనలు'గా వ్యవహరిస్తారు. 1534 జూన్ 14న నిర్యాణం చెందారు.

బుచ్చిబాబు (జయంతి)



కలం పేరు 'బుచ్చిబాబు'తో పేరొందిన శివరాజు వెంకటసుబ్బారావు 1916 జూన్ 14న పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో జన్మించారు. చిన్నకథల రచయితగా, నవలా రచయితగా, చిత్రకారుడిగా తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధిచెందారు. ఇంగ్లీషు లెక్చరర్‌గా కెరీర్ ప్రారంభించారు. రెండు దశాబ్దాలపాటు కథలు, నాటికలు ఆలిండియా రేడియోలో ప్రసారమయ్యాయి. 'చివరకు మిగిలేది' నవల ఎంతో పేరొందింది. 1946-47లో నవోదయం పత్రికలో సీరియల్‌గా ప్రచురితమైంది. మరణానంతరం సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించారు. 1967 సెప్టెంబరు 20న కన్నుమూశారు.

కాట్రగడ్డ మురారి (జయంతి)



తెలుగు సినీ నిర్మాతగా పేరొందిన కాట్రగడ్డ మురారి 1944 జూన్ 14న విజయవాడలో జన్మించారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్‌ను ప్రారంభించి నిర్మాతగా ఎదిగారు. 'యువచిత్ర ఆర్ట్స్' ప్రొడక్షన్స్ కింద 1978-90లమధ్య 10 సినిమాలు నిర్మించారు. ఆయన సినిమాలకు కేవీ మహదేవన్ సంగీతం అందించారు. గోరింటాకు, శ్రీనివాస కల్యాణం, నారీ నారీ నడుమ మురారి సినిమాలు ఆయనకు గుర్తింపు తెచ్చాయి. ప్రముఖ దర్శకులు కే విశ్వనాథ్, సింగీతం శ్రీనివాసరావు, దాసరి నారాయణ రావు, జంధ్యాల, కోడిరామకృష్ణ, రాఘవేంద్రరావు వంటి వారితో సినిమాలు తీశారు. 2022 అక్టోబరు 15న కన్నుమూశారు.

డొనాల్డ్ ట్రంప్ (పుట్టినరోజు)



అమెరికా దేశ 45వ అధ్యక్షుడిగా వ్యవహరించిన డొనాల్డ్ జాన్ ట్రంప్ 1946 జూన్ 14న జన్మించారు. వ్యాపారవేత్తగా, రాజకీయనేత రాణించారు. మిలిటరీ, ప్రభుత్వ సర్వీసులు లేకుండా రిపబ్లికన్ పార్టీ తరఫున ఎన్నికైన తొలి అమెరికా అధ్యక్షుడిగా 2017 నుంచి 2021 వరకు కొనసాగారు. అనంతరం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడి ఓటమి పాలయ్యారు. కాగా 1996 నుంచి 2015 వరకు మిస్ యూనివర్స్, మిస్ యూఎస్ఏ, మిస్ టీన్ యూఎస్ఏ పోటీలను ఆయన ప్రమోట్ చేశారు.

స్టెఫీగ్రాఫ్ (పుట్టినరోజు)



ప్రపంచంలో నెంబరు వన్ టెన్నిస్ మహిళా క్రీడాకారిణిగా పేరొందిన స్టెఫీగ్రాఫ్ 1969 జూన్ 14న జర్మనీలో జన్మించారు. పూర్తి పేరు స్టెఫాని మరియ గ్రాఫ్. టెన్నిస్‌లో ఏడేళ్లకు పైగా నెంబరు వన్‌స్థానంలో కొనసాగారు. 22 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ అందుకున్నారు. ఒకే ఏడాదిలో నాలుగు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్, ఒలింపిక్‌లో గోల్డ్‌మెడల్ సాధించడం ద్వారా 'గోల్డెన్‌స్లామ్'ను 1988లో అందుకున్నారు. 30వ యేట 1999లో రిటైర్మెంట్ ప్రకటించారు. వరల్డ్ నెంబరు 1 టెన్నిస్ క్రీడాకారుడు ఆండ్రీ అగస్సీని పెళ్లి చేసుకున్నారు. 2004లో టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేంలో చోటు దక్కించుకున్నారు. జర్మనీ దేశానికి చెందిన బోరిస్‌బెకర్‌తో కలసి టెన్నిస్ క్రీడ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు.

ప్రీతమ్ (పుట్టినరోజు)



ప్రీతమ్ చక్రబోర్తి 1971 జూన్ 14న బెంగాల్ రాష్ట్రం కోల్కత్తాలో జన్మించారు. స్వరకర్తగా, ఇన్‌స్ట్రుమెంటలిస్ట్, గిటార్ ప్లేయర్‌గా, సింగర్‌గా రాణించారు. ప్రముఖ బ్రాండ్‌లకు జింగిల్స్ సీరియల్స్‌కు టైటిల్ ట్రాక్స్ రూపొందించి బాలీవుడ్‌లోకి ప్రవేశించారు. బుల్లితెరపై సంగీత కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. 'ధూమ్' సినిమా ఎంతో గుర్తింపు తెచ్చింది. పలు ఆల్బమ్స్‌కు సంగీతం అందించారు. సంగీత దర్శకుడిగా ఐఐఎఫ్ఏ అవార్డు, ఫిల్మ్‌ఫేర్ అవార్డు, ఏసియా పసిఫిక్ స్క్రీన్ అవార్డులు, మ్యూజిక్ మిర్చి, గ్లోబల్ ఇండియన్ మ్యూజిక్ అవార్డులు అందుకున్నారు.

ఏడాదైనా క్వార్టర్స్ కేటాయించలేరా?

● మండిపడిన అశోక్



బెంగళూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షనేతకు ప్రభుత్వ కార్టర్స్‌ను కేటాయించే విషయంలో తీవ్ర జాప్యంపై బీజేపీ నేతలు మండిపడుతున్నారు. ఇదే విషయమై గురువారం ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతగా తనను కలిసేందుకు తమ పార్టీ ఎమ్మెల్యేలతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వస్తుంటారన్నారు. ప్రతిపక్షనేతకు ప్రభుత్వం క్వార్టర్స్ కేటాయించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయ్యింది. ఆరంభంలో ప్రతిపక్షనేతను ఎన్నుకునే విషయంలో జాప్యం జరిగింది. ఆతర్వాత ప్రతిపక్షనేత హోదాను అశోక్‌కు కేటాయించారు. అప్పటినుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నాలుగుసార్లు లేఖ పంపినా పట్టించుకోవడం లేదన్నారు. మంత్రులకు ప్రాధాన్యతపరంగా క్వార్టర్స్ కేటాయిస్తారన్నారు. ప్రతిపక్షనేతకు సంబంధించి ప్రాథమిక విధానాలు పాటించడం లేదన్నారు. గత ఏడాది నవంబరులోనే చీఫ్ సెక్రటరీకి లేఖ పంపినా పట్టించుకోలేదన్నారు. ఆతర్వాత ఫిబ్రవరిలో మరోసారి రాశానన్నారు. కుమారకృప నంబర్-1, రేస్ వ్యూవ్ కాటేజ్, రేస్‌వ్యూవ్ కాటేజ్-3లో ఒక చోట క్వార్టర్స్ కేటాయించాలని లేఖలో కోరానన్నారు. అధికారిక నివాసం లభించనందునే జయనగర్‌లోని ఇంటి నుంచే కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రితోపాటు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటిదాకా నాలుగు లేఖలు పంపినట్లు ఓప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఎమ్మెల్యేకి సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

పావగడ, జూన్ 13: పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్‌కు నూతన ఎమ్మెల్సీ డీటీ శ్రీనివాస్ బెంగళూరులోని ఎల్‌హెచ్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. 3న ఆగ్నేయ ఉపాధ్యాయ క్షేత్రానికి జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో డీటీ శ్రీనివాస్ తరుపున ఎమ్మెల్యే వెంకటేశ్, ఉపాధ్యాయులు ఎంతో శ్రమించి తన గెలుపుకు కారణమైన పావగడ నియోజకవర్గాన్ని ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. అధికార పార్టీ హయాంలో పావగడకు తనవంతు సాయం అందిస్తానని శ్రీనివాస్ తెలిపారు.

రక్తదానం చేసిన సైనికులు

బెంగళూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బాణసవాడి మిలటరీ కేంద్రంలో జరిగిన రక్తదాన శిబిరంలో సైనికులు వారి కుటుంబీకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిమ్హాన్స్, లయన్స్‌క్లబ్ బ్లడ్‌బ్యాంక్ విభాగం శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఈసందర్భంగా గ్యారిసన్ కమాండర్ మాట్లాడుతూ సమాజంలో ప్రమాదాల వేళ ప్రాణాలు కాపాడేందుకు రక్తం అవసరమన్నారు. ఆరోగ్యవంతులందరూ ప్రతి మూడనెలలకోసారి రక్తదానం చేయవచ్చు అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని మిలటరీ క్యాంపస్‌లో శిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. 300ల మంది సైనికులు, వారి కుటుంబీకులు రక్తదానం చేశారు.



రక్తదానం చేస్తున్న సైనికులు, వారి కుటుంబ సభ్యులు

అగ్రి టూరిజానికి ప్రాధాన్యం: మంత్రి



సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి చలువరాయస్వామి



బెంగళూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అగ్రి టూరిజంకు క్రమేపీ ప్రాధాన్యత పెరుగుతోందని వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి అభిప్రాయపడ్డారు. నగరంలోని ప్యాలెస్‌మైదానంలోని త్రిపురవాసినిలో వరల్డ్ ఆఫ్ హాస్పిటాలిటీ ఇన్‌క్రెడిబల్ చెఫ్ చాలెంజ్ సదస్సు, ప్రదర్శనలను గురువారం ప్రారంభించారు. కర్ణాటక, గోవాతోపాటు దక్షిణాది రాష్ట్రాల చెఫ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రి మునియప్ప మాట్లాడుతూ ఆహార ఉత్పత్తులకు ప్రాధాన్యం పెరుగుతూ వచ్చిందన్నారు. కేక్‌తోపాటు పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

జోరువాన



బెంగళూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నగర వ్యాప్తంగా గురువారం మధ్యాహ్నం జోరు వాన కురిసింది. జేసీ రోడ్డులో రహదారులు జలమయమయ్యాయి. నగరమంతటా వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయ్యింది.



శాంతిభద్రతలను పరిరక్షించాలి: ఎస్పీ

ముదిగుబ్బ, జూన్13: గ్రామాల్లో గొడవలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణం ఉండే విధంగా చూడాలని, శాంతిభద్రతలను పరిరక్షించాలని ఎస్పీ మాధవరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. ముదిగుబ్బ అప్‌గ్రేడ్, పట్నం పోలీస్ స్టేషన్లను గురువారం ఆయన తనిఖీ చేశారు. పోలీస్ లాకప్ గదులను పరిశీలించారు. అక్కడి పరిస్థితులపై సమీక్షించారు. రికార్డులను పరిశీలించి కేసు వివరాలపై స్థానిక ఎస్ఐలను ఆరా తీశారు. గ్రామాల్లో ప్రశాంతత లోపించకుండా, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలు, కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రౌడీ షీటర్లపై దృష్టి సారించి, వారి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. రాత్రి వేళలలో పోలీసు గస్తీ ముమ్మరం చేయాలన్నారు. ఎవరైనా అల్లర్లు, విధ్వంసాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించి అల్లర్లు, గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ సీఐ యతీంద్ర, పట్నం ఎస్ఐ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

హిందూపురం అర్బన్, జూన్ 13: హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు, కొల్లకుంట నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆబాద్‌పేటలోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బాలకృష్ణ హిందూపురం ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటికీ వైసీపీ అధికారంలో ఉండటంతో అప్పట్లో పలుమార్లు నిర్వహించిన ధర్నాలు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారన్నారు. అప్పట్లో హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, మెడికల్ కళాశాలను పురంలోనే ఏర్పాటు చేయాలని అఖిలపక్షాలతో కలిసి నిరసనలో పాల్గొని మాట్లాడారన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని బాలయ్య హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా మార్చేందుకు కృషి చేయాలని వారు కోరారు. బీఎస్పీ నాయకులు హరికుమార్, శిరివరం మూర్తి, ఎంఎల్ నారాయణ, మౌలాలి, ఖలందర్, బాబు, చిరంజీవి, నరసింహప్ప, సత్తెప్ప, అంజినప్ప, వెంకటరాముడు, గంగాధరప్ప పాల్గొన్నారు.

నయనమనోహరం



పుట్టపర్తి, జూన్ 13: స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మండపంలో గురువారం హర్యానా రాష్ట్రానికి చెందిన సత్యసాయి విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు నయనమనోహరంగా సాగాయి. సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరింపజేశారు. హిస్సార్‌కు చెందిన సత్యసాయి హయ్యర్ సెకండరీ విద్యార్థినులు హరితుమ్ హేనా హర్యానా పేరిట నృత్యాన్ని ప్రదర్శించారు. హర్యానా సంప్రదాయ నృత్యంతో భక్తులను మైమరపింపజేశారు. మహిశాసురమర్ధిని నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. సాయిభక్తి పాటలను ఆలపించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

మద్దతు ఇచ్చినవారికి ధన్యవాదాలు : శెట్టర్



బెంగళూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో తన విజయానికి పరోక్ష మద్దతు ఇచ్చిన ఇతర పార్టీలవారికి ధన్యవాదాలని బెళగావి నూతన ఎంపీ జగదీశ్ శెట్టర్ తెలిపారు. గురువారం బెళగావిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మార్చి 27న బెళగావికి వచ్చినపుడు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఏప్రిల్ 17న నామినేషన్‌వేళ ప్రజలు కూడా పెద్దసంఖ్యలో వచ్చారని, ప్రధాని నరేంద్రమోదీ బెళగావిలో సమావేశం నిర్వహించారన్నారు. దివంగత సురేశ్‌అంగడి 16ఏళ్లపాటు అందించిన సేవలే తనకు కలిసొచ్చాయన్నారు. లోక్‌సభ ఎన్నికలు జాతీయస్థాయికి సంబంధించినవని, జాతీయ నాయకుల ప్రభావం ఉంటుందన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలతో గెలుస్తామని కాంగ్రెస్ నాయకులు భ్రమపడ్డారన్నారు. ఓటమి చెందాక కాంగ్రెస్ నాయకులే ఇప్పుడు వాటిని వ్యతిరేకిస్తున్నారన్నారు. గ్యారెంటీపథకాల అమలుతో ఏ కాంగ్రెస్ ఎమ్మెల్యే సంతోషంగా లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై తాను మాట్లాడేది లేదన్నారు. జగదీశ్‌శెట్టర్ వ్యాఖ్యలు స్థానికంగా సంచలనం కలిగించాయి.

ఎస్ఎన్ఎస్ శిబిరాలతో సమాజంపై అవగాహన

● ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు

దొడ్డబళ్ళాపుర, జూన్ 13: సమాజాన్ని అర్థం చేసుకునేందుకు ఎస్ఎన్ఎస్ శిబిరాలు దోహదపడతాయని ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు అభిప్రాయపడ్డారు. తాలూకాలోని వడ్డరహళ్ళి గ్రామంలో ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో ఏర్పాటైన ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఇటీవలికాలంలో ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో సైతం చక్కటి కార్యక్రమాలు కొనసాగుతుండడం అభినందనీయమన్నారు. పాఠాలకే పరిమితం కాకుండా సాంస్కృతిక, క్రీడా రంగంలోనూ రాణించేలా ప్రోత్సహిస్తుండడం ప్రశంసనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ శిబిరాలతో సేవామనోభావం పెరుగుతుందన్నారు. రిటైర్డు ప్రొఫెసర్ చంద్రప్ప మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ అంటే గ్రామంలో సౌలభ్యాల పెంపుకోసం పాటుపడాలని యువతకు సూచించారు. కేవలం ప్రమాణ పత్రాలకే పరిమితం కాకుండా చక్కటి వ్యక్తిత్వం పెంచుకోవాలన్నారు. తమకు ఆసక్తిగల రంగంలో రాణించాలన్నారు. చక్కటి సమాజనిర్మాణంలో సైనికుల్లా ఉండాలని అభిలషించారు. ఇదే సందర్భంగా శిబిరం అనుభవాలను విద్యార్థులు హేమంత్, నవ్య, దర్శన్ తదితరులు పంచుకున్నారు. గ్రామాలలో స్వచ్ఛతపై అవగాహన పెంచడం, నాయకత్వ లక్షణాలు పెంచేందుకు శిబిరాలు దోహదపడ్డాయన్నారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ గంగాధరయ్య మాట్లాడుతూ ఏడు రోజుల శిబిరాన్ని పూర్తి చేసుకున్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన రాజగోపాల్, అజయ్ కుమార్, శోభ రాజగోపాల్, సునితా శ్రీనివాస్, మాళవ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు